

## భోపాల్ వంతెనలో 90 డిగ్రీల మలుపు

- ప్రమాదకరమని స్థానికుల ఆందోళన
- చిన్న వాహనాలకే అనుమతి: అధికారులు

భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌లో 90 డిగ్రీల మలుపు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 648 మీటర్ల పొడవు, 8.5 మీటర్ల వెడల్పుతో రూ.18 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. దీనిపై ప్రయాణించే వాహనాలు ఒకేసారి 90 డిగ్రీల మలుపు తిరిగితే, ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోపాల్‌లోని ఇష్‌బాగ్ రైల్వే క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించి, సుదీర్ఘ సమయం వేచి ఉండవలసిన అవసరాన్ని నివారించడం కోసం ఈ వంతెనను నిర్మించారు. దీని వల్ల మహామాయి కా బాగ్, పుష్ప నగర్, స్టేషన్ ఏరియా వారికి ప్రయోజనం కలుగుతుంది. రోజూ ఈ మార్గంలో ప్రయాణించే మూడు లక్షల మందికి ఈ వంతెన ఉపయోగకరం. ప్రయాణానికి పట్టే సమయం తగ్గుతుందని, ట్రాఫిక్ అంతరాయాలు తగ్గుతాయని అధికారులు చెప్పారు. . ప్రజా పనుల శాఖలోని వంతెనల శాఖ చీఫ్ ఇంజినీరు వీడీ వర్మ మాట్లాడుతూభూమి తగినంత అందుబాటులో లేనందువల్ల మరో అవకాశం లేకపోయిందని, ఈ వంతెనపై నుంచి చిన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. రెండు కాలనీలను అనుసంధానం చేయడానికే ఈ వంతెనను నిర్మించినట్లు తెలిపారు. వాహనాల వేగాన్ని పరిమితం చేస్తామన్నారు.

## రుద్రాస్త్ర పరీక్షలు విజయవంతం



*న్యూఢిల్లీ: పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన హైబ్రిడ్ వీటీఓఎల్ యూఏవీ రుద్రాస్త్ర పరీక్షలు విజయవంతమయ్యాయి. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మానవ రహిత గగనతల వాహనం (యూఏవీ) అసాధారణ పనితీరును కనబరచింది. భారత సైన్యం నిర్దేశించిన అన్ని కార్యకలాపాల పరామితులకు అనుగుణంగా పని చేసింది. వెర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వీటీఓఎల్) సామర్థ్యాలు సహా, లక్ష్యాన్ని అత్యంత కచ్చితంగా ఛేదించడం, మిషన్ ఫ్లెక్సిబిలిటీ వంటి అన్ని అంశాల్లో విజయవంతమైంది. రన్‌వే అవసరం లేకుండానే నిలువుగా ఎగరగలిగే, భూమిపైకి దిగగలిగే సామర్థ్యాన్నే వీటీఓఎల్ అంటారు. రుద్రాస్త్ర తనకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించిన తర్వాత తాను ప్రారంభమైన చోటుకు తిరిగి సురక్షితంగా వచ్చింది. లక్షిత ప్రాంతంలో సంచరించే సామర్థ్యం సహా మొత్తం పరిధి 170 కి.మీ. దాటింది. ఇది సుమారు 1.5 గంటలపాటు ఆకాశంలో ఎగరగలదని అంచనా. ప్రెసిషన్ గైడెడ్ యాంటీ పెర్సనల్ వార్‌హెడ్‌ను విజయవంతంగా మోహరించడం ఈ పరీక్షలో చెప్పుకోదగ్గ ముఖ్యాంశం.*

### 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే

# మహిళలకు 33% రిజర్వేషన్లు!

- జన, కులగణన పూర్తయ్యాక నియోజకవర్గాల పునర్విభజన
- ఆ తర్వాత మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం యోచన!
- జనాభా ఆధారంగా ఎంపీ సీట్ల పునర్విభజనను వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, పార్టీలు



న్యూఢిల్లీ, జూన్ 12: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఇండియా టుడే టీవీకి గురువారం ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2027లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ నిర్వహిస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత వారం ప్రకటించింది. మొట్టమొదటిసారి ఇందులో కులగణన కూడా భాగం కానున్నది. ఇది రెండు విడతలుగా జరగనున్నది. హిమపాతం అధికంగా ఉండే పర్వత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము కశ్మీరు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలలో 2026 అక్టోబర్‌లో, మిగిలిన రాష్ట్రాలలో 2027లో ఈ ప్రక్రియ జరగనున్నది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన నిర్వహించనున్నారు. రెండేళ్లలో జనాభా లెక్కల సేకరణ పూర్తవుతుందని, తాజా జనాభా గణాంకాల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023 సెప్టెంబర్‌లో పార్లమెంట్ ఆమోదం పొందిన నారీ శక్తి వందన్ అధినియం లేక మహిళా రిజర్వేషన్ బిల్లు, 2023కు అనుగుణంగా 33 శాతం రిజర్వేషన్ కోటా అమలు అవుతుంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన ఈ చట్టం ఆమోదం పొందిన తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కల సేకరణ ఆధారంగా అమలులోకి వస్తుంది.

**27 ఏళ్ల తర్వాత ఆమోదం**

దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు 1996లో మొదటిసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు మారిన అనేక ప్రభుత్వాలను, చర్చలను వీక్షించి 27 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు ఆమోదం పొందింది. ఈ చట్టంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అమలులోకి వచ్చిన తర్వాత 15 సంవత్సరాల పాటు మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలలో ఎటువంటి మార్పులు ఉండవు.

**నష్టపోనున్న దక్షిణాది**

జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై అధికార ఎన్‌డీఏ, ప్రతిపక్షాల మధ్య తీవ్ర అభిప్రాయభేదాలు నెలకొన్నాయి. చివరిసారి 2011లో 15వ జనాభా లెక్కల సేకరణ జరిగింది. తిరిగి 2021లో జరగవలసి ఉండగా కొవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. కాగా, నియోజకవర్గాల పునర్విభజన దేశంలో 1952, 1963, 1973, 2002లో జరిగింది. సామాన్య పౌరుల భాషలో చెప్పాలంటే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల హద్దులను మార్చి సంఖ్యను పెంచడం. ఎంపీ లేక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించే ప్రజల సంఖ్య దాదాపు సమానంగా ఉండేలా చూడాల్సి ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు సంతృప్తిగా లేవు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ పలు సందర్భాలలో దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్య యథాప్రకారం ఉన్న పక్షంలో ఉత్తరాది రాష్ట్రాలు, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి మధ్య భారత రాష్ట్రాలు ప్రయోజనం పొందుతాయని నిపుణులు తెలిపారు. ఈ రాష్ట్రాలు సుమారు 31 స్థానాలు అదనంగా పొందవచ్చని, అదే సమయంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు సుమారు 26 స్థానాలను కోల్పోవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ తేడాకు ఉత్తరాది రాష్ట్రాలు, మధ్య భారతంలోని రాష్ట్రాలలో జనాభా పెరుగుదల అత్యంత వేగంగా ఉండడమే ఇందుకు కారణమని వారు తెలిపారు.

## ప్రపంచ లింగ అసమానతల్లో దిగజారిన భారత్

### 146 దేశాల జాబితాలో 131వ స్థానం




న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన ప్రపంచ లింగ అసమానత నివేదిక-2025లో భారత్ నిరుడుతో పోలిస్తే రెండు స్థానాలు కిందకు దిగజారి 131వ స్థానంలో నిలిచింది. 64.1 శాతం స్కోర్‌తో దక్షిణాసియాలో అతి తక్కువ ర్యాంక్ పొందిన దేశంగా అపకీర్తిని మూటగట్టుకుంది. గురువారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలు, విద్యార్జన, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారత వంటి కీలకాంశాల ప్రాతిపదికన ఈ నివేదికను రూపొందించారు. ఆర్థిక భాగస్వామ్యం, విద్యార్జన అంశాల్లో భారత్ కొంత మెరుగైన ఫలితాలను(40.7 శాతం) సాధించింది. శ్రామిక శక్తి భాగస్వామ్యం నిరుడు ఎంతో ఉందో(45.9 శాతం) ఈ సంవత్సరం అంతే ఉంది. విద్యార్జనను పరిశీలిస్తే మహిళల అక్షరాస్యత, విద్యా సంస్థల్లో వారి ప్రవేశాల స్థాయిలో మెరుగుదల కనిపించింది. లింగ నిష్పత్తి, ఆరోగ్యం-మనుగడ అంశాల్లో భారత్ ప్రగతి సాధించినప్పటికీ స్త్రీ-పురుషుల ఆయుర్దాయం తగ్గింది. రాజకీయ సాధికారతలోనూ భారత్ పాయింట్లు కాస్త (-0.6) తగ్గాయి.

## కర్ణాటక, ఏపీ మధ్య మామిడి లడాయి

### తోతాపురి మామిడిపై ఏపీ నిషేధం.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అభ్యంతరం

న్యూఢిల్లీ, జూన్ 12: కర్ణాటక, ఏపీ మధ్య మామిడి పండ్ల రవాణాపై వివాదం ఏర్పడింది. కర్ణాటక నుంచి చిత్తూరు జిల్లాకు వచ్చే తోతాపురి మామిడిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలంటూ ఏపీ సీఎం చంద్రబాబుకు కర్ణాటక కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్య లేఖ రాశారు. ఈ ఏడాది చిత్తూరు జిల్లాలో పెద్దఎత్తున మామిడి పండడంతో, సరైన ధర రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కర్ణాటక నుంచి కూడా తోతాపురి మామిడి భారీగాదిగుమతి కావడంతో ధర మరింత దిగజారే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో తోతాపురి మామిడి ఇతర రాష్ట్రాల నుంచి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించడాన్ని నిషేధిస్తూ జూన్ 7న ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వ చర్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సిద్దరామయ్య.. మామిడిపై నిషేధాన్ని ఆకస్మిక, ఏకపక్ష చర్యగా పేర్కొన్నారు. ఈ నిషేధం కర్ణాటక సరిహద్దులోని రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. చిత్తూరుకు చెందిన పల్ప్ ప్రాసెసింగ్, ఇతర మార్కెటింగ్ విధానాల ద్వారా అక్కడ తమ మామిడిని అమ్మడానికి రైతులు ఎన్నో ఏండ్లుగా ఆధారపడ్డారని, ఏపీ ప్రభుత్వ చర్య కారణంగా సరుకు రవాణా వ్యవస్థ దెబ్బతినడమే కాక, వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ నిషేధం సహకార సమాఖ్య సిద్ధాంతాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.



## అమెరికన్ మెడికల్ అసోసియేషన్ చీఫ్‌గా బాబీ ముక్కామల

### ఈ సంస్థ సారథుల్లో తెలుగు ఫిజిషియన్

న్యూయార్క్ : భారత సంతతికి చెందిన తెలుగు ఫిజిషియన్ బాబీ ముక్కామల అమెరికన్ మెడికల్ అసోసియేషన్ 180వ అధ్యక్షునిగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సంస్థ సారథ్య బాధ్యతలు చేపట్టిన తొలి భారత సంతతి ఫిజిషియన్ ఆయనే. ఈ సంఘానికి చెందిన సబ్‌స్టేన్స్ యూజ్ అండ్ పెయిన్ కేర్ టాస్క్ ఫోర్స్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణుడు. ఆయన మెదడులో 8 సెంటీమీటర్ల కణితి ఉన్నట్లు నిరుడు నవంబరులో గుర్తించారు. ఆయన తల్లిదండ్రులు 1970వ దశకంలో భారత్ నుంచి అమెరికాకు వెళ్లి, మిషిగన్‌లోని ఫ్లింట్‌లో స్థిరపడ్డారు. వారిద్దరూ కూడా ఫిజిషియన్లే.



## రష్యన్ డ్రోన్లను కూల్చితే నెలకు రూ.2 లక్షలు

### ఉక్రెయిన్ బంపర్ ఆఫర్

కీవ్ : డ్రోన్లతో విరుచుకుపడుతున్న రష్యాకు గట్టి బుద్ధి చెప్పేందుకు ఉక్రెయిన్ సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నది. డ్రోన్లను కూల్చడానికి సైన్యానికి బదులుగా స్వచ్ఛంద కార్యకర్తలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. రష్యా నుంచి వచ్చే డ్రోన్లను కూల్చేవారికి ఒక్కొక్కరికి నెలకు రూ.2.2 లక్షలు చొప్పున చెల్లిస్తామని ఉక్రెయిన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి మంత్రి వర్గ ఆమోదం లభించిందని ప్రభుత్వ ప్రతినిధి తారస్ మెల్నిచుక్ మీడియాకు చెప్పారు. శిక్షణ పొందిన వాలంటీర్లు, డ్రోన్ ఆపరేషన్‌లో నైపుణ్యంగల పారామిలిటరీ సిబ్బంది మానవ రహిత వాహనాలు, ఆయుధాలతో రష్యన్ డ్రోన్లను కూల్చవలసి ఉంటుంది.

## 55వేలు దాటిన గాజా మృతులు

డెయిర్ అల్-బలాహ్ (గాజా స్ట్రిప్): ఇజ్రాయెల్-హమాస్ మధ్య 20 నెలల నుంచి జరుగుతున్న యుద్ధంలో మరణించిన పాలస్తీనీయుల సంఖ్య 55,104 అని గాజా హెల్త్ మినిస్ట్రీ బుధవారం ప్రకటించింది. మృతుల్లో సగానికిపైగా మహిళలు, బాలలు ఉన్నట్లు తెలిపింది. దీనిపై ఇజ్రాయెల్ స్పందిస్తూ, తాము కేవలం ఉగ్రవాదులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నామని, సామాన్య ప్రజల మరణాలకు కారణం హమాస్ ఉగ్రవాద సంస్థేనని చెప్పింది. ప్రజల మధ్య ఉగ్రవాదులు దాక్కుంటున్నారని తెలిపింది. ఈ యుద్ధంలో 1,27,394 మంది గాయపడినట్లు గాజా హెల్త్ మినిస్ట్రీ తెలిపింది.

## మైనారిటీ కాలేజీల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా ఉండదు

### బాంబే హైకోర్టు

ముంబై : మైనారిటీ విద్యా సంస్థల్లో ప్రథమ సంవత్సరం జూనియర్ కాలేజ్ అడ్మిషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను బాంబే హైకోర్టు గురువారం నిలిపేసింది. దీనిపై సమాధానాన్ని సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు వారాలు గడువు ఇచ్చింది. ఆ తర్వాత రెండు వారాల్లో స్పందించాలని పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 6న జరుగుతుందని తెలిపింది. ప్రభుత్వ న్యాయవాది నేహా భిడే వాదనలు వినిపిస్తూ, మైనారిటీల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం స్పృశించలేదన్నారు. మైనారిటీలు తమకు గల అన్ని సీట్లను భర్తీ చేసుకోవచ్చునని, ఖాళీ సీట్లను సరెండర్ చేసే దశలో మాత్రమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల అంశం వస్తుందని చెప్పారు. సరెండర్ చేసిన సీట్లకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.



## నిరసనకారులపైకి దూసుకొచ్చిన కారు

షికాగో, జూన్ 12: ఇమ్మిగ్రేషన్ దాడులకు వ్యతిరేకంగా మంగళవారం షికాగోలోని ఈస్ట్ మన్రో వీధిలో నిరసనకారులపై ఓ కారు దూసువచ్చి, ఫుట్‌పాత్‌పై నిలుచున్న 66 ఏళ్ల మహిళను ఢీకొంది. ఆ మహిళ చేయి విరిగిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనకారులపైకి దూసుకు వెళ్లేందుకు కారు ప్రయత్నించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. దూసుకొస్తున్న కారును చూసి నిరసనకారులు పక్కకు పరుగెత్తగా ఫుట్‌పాత్‌పై వృద్ధురాలు పడిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మహిళను ఢీకొన్న తర్వాత కారు ఆగకుండా వెళ్లిపోయింది.

## 2 జీవిత ఖైదు శిక్షలు పడితే, అమలు ఎలా?

- విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ : ఓ వ్యక్తికి రెండుసార్లు జీవిత ఖైదు శిక్షలు పడినపుడు, వాటిలో ఒకటి పూర్తయిన తర్వాత మరొకదానిని అమలు చేయవచ్చునా? అనే ప్రశ్నపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు గురువారం అంగీకరించింది. 2010లో జరిగిన జంట హత్యల కేసులో దోషికి పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు రెండు జీవిత ఖైదులను విధిస్తూ 2015లో తీర్పు చెప్పింది. తుది శ్వాస వరకు జైలులో ఖైదీగా ఉండాలని చెప్పేదే జీవిత ఖైదు అని, రెండు జీవిత ఖైదు శిక్షలను విధించడం నిష్ప్రయోజనకరమని తెలిపింది. శిక్ష తగ్గింపు, క్షమాభిక్ష వల్ల ఆ జీవిత ఖైదు శిక్షా కాలం తగ్గిపోతుందని గుర్తు చేసింది. అటువంటి పరిస్థితుల్లో శిక్ష అమలు ప్రారంభమవుతుందని పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టులో గురువారం వాదనలు వినిపించారు.

# ఇరాన్‌పై దాడికి సన్నాహాలు!

- ఇజ్రాయెల్, అమెరికా ఏర్పాట్లు
- పశ్చిమాసియా ప్రమాదకరంగా మారవచ్చని అభిప్రాయాలు
- సైనిక కుటుంబాలు, దౌత్య సిబ్బంది వెంటనే తరలిపోవాలి
- ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టీకరణ
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా ప్రకటనలో వెల్లడి
- ఏదేమైనా అణు కార్యక్రమం కొనసాగుతుందని స్టేట్‌మెంట్
- ఇరాన్ దౌత్య సిబ్బందికి స్పష్టీకరణ



ఇరాన్‌లోని ఒక అణుప్లాంట్

వాషింగ్టన్, జూన్ 12: ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్టు పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలను బట్టి తెలుస్తున్నది. ఇరాన్‌తో అణు ఒప్పందంపై అమెరికా జరుపుతున్న చర్చలు విఫలమైన నేపథ్యంలో ఆ దేశ అణు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులకు సిద్ధమవుతున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమాసియాను ఉద్దేశించి ఆయన 'అది అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం కావచ్చు. మా సైనిక కుటుంబాలను, దౌత్య సిబ్బందిని అక్కడి నుంచి తరలిస్తున్నాం. ఆ ప్రాంతాన్ని వీడాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. ఇకపై ఏం జరుగుతుందో చూడాలి' అని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఏదైనా మార్గం ఉందా అని మీడియా ప్రశ్నించగా 'వారు (ఇరాన్) అణ్వాయుధాలు కలిగి ఉండకూడదు. అంతే!' అని అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో ఇరాక్‌లోని దౌత్య కార్యాలయం నుంచి కూడా అమెరికా తన సైనిక కుటుంబాలను, ఇతర సిబ్బందిని తరలిస్తున్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. భద్రతాపరమైన ముప్పు ఎటువంటిదో తెలుపకుండానే అమెరికా తన సిబ్బందిని తరలిస్తున్నదని, దీంతో చమురు ధరలు నాలుగు శాతం పెరిగాయని ఇరాకీ వర్గాలు పేర్కొన్నాయి. బహ్రెయిన్, కువైట్‌లోని తమ సిబ్బంది అక్కడే ఉండాలా లేక తరలిపోవాలా అన్నది వారి నిర్ణయానికే వదిలేశామని అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు చెప్పారు. ఇజ్రాయెల్‌లో ఉంటున్న తమ దౌత్య సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు టెల్‌అవీవ్ నగరం దాటి వెళ్లవద్దని అమెరికా ఒక ప్రకటనలో సూచించింది. క్షిపణి, మోర్టార్, రాకెట్ లేదా డ్రోన్‌ల ద్వారా దాడులు జరిగితే ఎక్కడ దాక్కోవాలో అవగాహన కలిగి ఉండాలని పేర్కొంది. పశ్చిమాసియాలో అమెరికన్ల భద్రత వాతావరణం అత్యంత సంక్లిష్టంగా ఉందని, అది ఏ క్షణమైనా మారిపోవచ్చునని హెచ్చరికలు జారీ చేసింది.

**మాపై దాడి చేస్తే, అమెరికా స్థావరాలపై ప్రతి దాడి చేస్తాం..**

ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమంపై చర్చలు విఫలమైతే ఆ దేశంపై దాడి చేస్తామని ట్రంప్ పలుమార్లు బెదిరించారు. మరోవైపు ఇరాన్ కూడా అమెరికా దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. తమపై దాడులు జరిగితే ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ప్రతీకార దాడులకు దిగుతామని ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదేహ్ పేర్కొన్నారు. ఇరాక్, కువైట్, ఖతర్, బహ్రెయిన్, దుబాయ్ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. ఇదిలా ఉండగా వచ్చే ఆదివారం ఇరాన్, అమెరికా మధ్య ఆరో దఫా చర్చలు జరుగుతాయని ఒమన్ విదేశాంగ మంత్రి చెప్పారు. కాగా, తమ అణు కార్యక్రమాన్ని ఆపే ప్రసక్తే లేదని, ఒప్పందం కుదిరినా, కుదరకపోయినా అది కొనసాగుతుందని చర్చలు జరుపుతున్న ఇరాన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

## ట్రంప్ గోల్డ్ కార్డు వెబ్‌సైట్ ప్రారంభం

- అధికారికంగా పేర్ల రిజిస్ట్రేషన్‌కు ఆహ్వానం
- 50 లక్షల డాలర్లతో గ్రీన్‌కార్డుకు రాచమార్గం

వాషింగ్టన్,జూన్ 12: ఎంతోకాలంగా ఊరిస్తూ వస్తున్న గోల్డ్ కార్డు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రారంభించారు. విదేశీ వలసదారులు అమెరికా ప్రభుత్వానికి 50 లక్షల డాలర్లు(దాదాపు రూ. 43 కోట్లు) చెల్లించడం ద్వారా అమెరికా పౌరసత్వాన్ని పొందేందుకు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడమే ఈ గోల్డ్ కార్డు ఉద్దేశం. ప్రపంచంలో ఎక్కడా లేని అత్యంత గొప్ప దేశానికి, మార్కెట్‌కు దారి చూపించే అద్భుత ప్రయాణం సాగించేందుకు ఎక్కడ సంతకం చేయాలని వేలాది మంది తనను అడుగుతున్నట్లు ట్రంప్ తన ట్రూత్ పోస్టులో పేర్కొన్నారు.

**దరఖాస్తు ఎలా?**

"ట్రంప్ కార్డు"పై ఆసక్తి ఉన్న వారిని మాత్రమే వెబ్‌సైట్ అనుమతిస్తోంది. అభ్యర్థి తన పేరు, మతం, చిరునామాను రిజిస్టర్ చేసుకోవలసి ఉంటుంది. trumpcard.gov పేరుతోఉన్న ఈ కొత్త వైబ్‌సైట్‌లో బంగారు రంగు కార్డు నమూనాను ఉంచారు. కార్డుపైన 5 మిలియన్ డాలర్లని అంకె ముద్రించారు. యూరప్, ఆసియా(పశ్చిమాసియాతో సహా), ఉత్తర అమెరికా, ఓషియానియా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా, కరీబియన్, ఆఫ్రికా వంటి 8 ప్రాంతాల నుంచి మాత్రమే దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

## ఠాగూర్ పూర్వీకుల ఇంటిపై దాడి

### బంగ్లాలో మూకల దుశ్చర్య

ఢాకా, జూన్ 12: నోబెల్ గ్రహీత, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకులకు చెందిన ఎస్టేట్‌ను మంగళవారం బంగ్లాదేశ్‌లో మూకలు ధ్వంసం చేశాయి. అక్కడిఎస్టేట్‌లోని మ్యూజియంని సందర్శకుల కోసం తెరచి ఉంచుతారు. బంగ్లాదేశీ పౌరుడు షా నవాజ్ మంగళవారం కుటుంబంతో కలసి మ్యూజియం సందర్శనకు వచ్చాడు. మోటారు సైకిల్ పార్కింగ్ రుసుము విషయంలో నవాజ్‌కు, అక్కడి సిబ్బందికి గొడవ జరిగింది. అతనిపై సిబ్బంది దాడి చేయగా బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) స్థానిక నాయకులు అడ్డుపడి ఆడిటోరియంపై దాడి చేశారు. కిటికీలు, తలుపులు, ఫర్నీచర్‌ని ధ్వంసం చేశారు. అక్కడి నిర్వాహకుడిని కూడా చితకబాదారు.

# నీ మనసు నాకు తెలుసు!

- *ఏఐని తలదన్నే సూపర్ మేధ 'ఏజీఐ'*
- *మనసెరిగి మసలుకోవడమే ప్రత్యేకత*
- *సలహాలు, సూచనలు ఇస్తూ స్నేహితుడిగా వ్యవహారం*
- *భావోద్వేగమెరిగి మనసుతో సంభాషణలు చేసే లక్షణం*
- *ఏజీఐతో మొత్తంగా మనిషిని పోలిన 'మర' మనిషి ఆవిష్కారం!*



*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): లక్షలాది వీడియోల్లో మనమెక్కడ ఉన్నామో కనిపెట్టడం కృత్రిమ మేధ (ఏఐ)కి చిటికెలో పని. కానీ, ఆ వీడియోలో మనం ఆనందంగా ఉన్నామా? విచారంగా ఉన్నామా?అసలు ఎందుకు అలా ఉన్నామో కనిపెట్టేది ఒక్కరే. అది తోటిమనిషి. అయితే, ఇది ఇప్పటివరకూ. భవిష్యత్తులో ఈ పనిని కూడా మెషీన్లే చేయబోతున్నాయి. 'నీ మనసు ఏమిటో నాకు తెలుసు' అంటూ ఈ మర మనుషులు మరో మనిషిగా మారబోతున్నాయి. దీనికి కారణం ఏఐ పరిశోధనల్లో కీలక ముందడుగే. అదే ఏజీఐ (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్).*

***ఏమిటిది?***

*మనిషిలా ఆలోచించి, పరిస్థితులకు తగ్గట్టు మసలుకొనే కృత్రిమ మేధ రకమే 'ఏజీఐ'. కృత్రిమ మేధలో దీన్ని అడ్వాన్స్‌డ్ వెర్షన్‌గా చెప్పొచ్చు. ఇది అర్థం చేసుకోగలదు. చదవగలదు. మనుషుల్లాగే తన ఆలోచనలు, తెలివితేటలను రకరకాల పనులకు వాడుకోగలదు. నేర్చుకోవడంతో పాటు గత అనుభవాలను బట్టి తనను తాను మెరుగుపరుచుకొంటుంది. స్నేహితుడిలా సలహాలు, గైడ్‌గా సూచనలు ఇస్తుంది. భావోద్వేగాలను బట్టి సంభాషణలు సాగిస్తుంది. ఒకవిధంగా మనిషి కాని మనిషిగా దీన్ని చెప్పొచ్చు.*

***ఏఐకు.. ఏజీఐకు తేడా ఏమిటి?***

*ఏఐ తనకు అందుబాటులోని డాటా ఆధారంగా ఏ ప్రశ్న అడిగామో.. దానికి సరైనదనుకొన్న సమాచారాన్ని మాత్రమే ఇస్తుంది. మనుషుల ఫొటోలు, గొంతును ఏఐ గుర్తుపడుతున్నప్పటికీ, మాటల్లోని వ్యంగ్యాన్ని, ఉద్వేగాల్ని, ముఖంలోని భావోద్వేగాల్ని పసిగట్టలేకపోతున్నది. అయితే, ఏజీఐ పూర్తిగా మనిషిలా ఆలోచిస్తుంది. మన అవసరాలను, అలవాట్లను అవగాహన చేసుకొంటుంది. మానవ అభిజ్ఞ నైపుణ్యాలు, తర్కాన్ని జోడించి.. ఏది మంచో ఏది కాదో గుర్తించి సలహాలు, సూచనలు ఇస్తుంది. అంటే రోబో సినిమాలో భావోద్వేగాలు లేని చిట్టి 'ఏఐ' అయితే, భావోద్వేగాలు వచ్చిన తర్వాత చిట్టిని 'ఏజీఐ'గా చెప్పొచ్చు.*

***వాటిని తలదన్నేలా..***

*ఓపెన్ ఏఐకు చెందిన జీపీటీ-4 మాడల్, గూగుల్ డీప్‌మైండ్, డీప్‌సీక్, గ్రోక్ తదితర టూల్స్ ఏఐ సాంకేతికతలో ముందున్నాయి. ఇప్పుడు వీటిని తలదన్నేలా ఏజీఐని అతి త్వరలో తీసుకురావాలని మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏఐ రంగంలో 50 మంది టాప్ సైంటిస్టులతో ఇటీవల తన నివాసంలో సమావేశమైన జుకర్‌బర్గ్ ఈ ఏజీఐ ప్రాజెక్టును వారికి అప్పగించినట్టు బ్లూమ్‌బర్గ్ ఓ కథనంలో వెల్లడించింది. ఇందుకోసం వారికి భారీ యెత్తున ప్యాకేజీ ఇచ్చినట్టు సమాచారం. కాగా, మనిషిని తలదన్నే రీతిలో మేధస్సును అందిపుచ్చుకొనే ఏజీఐని సరైన విధంగా నియంత్రించకపోతే తీవ్ర పరిణామాలు, ముప్పు వాటిల్లవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*